క్లుప్తంగా

టిడ్కో నివాసాల్లో వీధిలైట్లు ఏర్పాటు



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాక ఇందిరానగర్ టిడ్కో నివాసాలకు ఆదివారం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వీధి లైట్లను ఏర్పాటు చేశారు. నాలుగు బజారుల్లో 24 లైట్లు ఏర్పాటు చేసినట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. త్వరలోనే కృష్ణాయపాలెం యర్రబాలెం రోడ్ నుంచి టిడ్కో నివాసాల వరకు మరో 15 లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి స్థానికులు వాట్సాప్ మెసేజ్ చేశారని, మెసేజ్ చేసిన 24 గంటల్లో కమిషనర్ శారదాదేవి ఆదేశాల మేరకు వీధిలైట్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం చుక్కపల్లివారిపాలెం నుంచి ఈమని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే 8,9,10 తరగతుల విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ ఆదివారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ మాట్లాడుతూ దుగ్గిరాల రోటరీ క్లబ్ వారి ఆర్థిక సహాయంతో పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులు పునఃప్రారంభం

ఎమ్మెల్యే ఆర్కే సొంత నిధులు కేటాయింపు



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పెనుమూలిలో మధ్యలో నిలిచిపోయిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పునఃప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తన సొంత నిధులు కేటాయించడంతో ఆదివారం గ్రావెల్ ఫిల్లింగ్ కార్యక్రమం చేపట్టారు. రోడ్డుకు సుమారు 5 అడుగుల లోతులో ఉండడంతో రోడ్ లెవెల్ గ్రావెల్ ఫిల్లింగ్ చేస్తున్నట్లు పెనుమూలి ఎస్సీ కమ్యూనిటీ హాల్ కమిటీ సభ్యులు తెలిపారు. రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో గ్రావెల్ ఫిల్లింగ్ పనులు పూర్తవుతాయని, కమ్యూనిటీ హాల్ నిర్మాణం పట్ల ఎమ్మెల్యే శ్రద్ధ చూపిస్తున్నందుకు పెనుమూలి గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

భవానీ పీఠంలో శాకంబరీ ఉత్సవాలు



తాడికొండ: తాడికొండ శివారు బడేపురం గ్రామంలోని భవానీ పీఠంలో ఆషాఢ మాసం పురస్కరించుకొని ప్రారంభమైన విజయ భవానీ అమ్మవారి శాకాంబరి ఉత్సవాలు రెండవ రోజు ఘనంగా కొనసాగాయి. ఆలయంలో ఉదయం ఘనంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచన అమ్మవారికి వివిధ రకాలైన కూరగాయలతో అలంకరణ పలు కుంకుమార్చనలు జరిగాయి. స్థానిక బీసీ కాలనీ నుంచి తాడికొండ గాంధీ పార్కులో ఉన్న మహాలక్ష్మీ అమ్మవారి చెట్టు వరకు భక్తులు ఊరేగింపుగా వచ్చి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఠం వ్యవస్థాపకులు కొల్లిపర నాగకోటేశ్వరశర్మ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

కార్మెల్‌కొండపై భక్తుల సందడి



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్‌కొండపై ఉన్న కార్మెల్ మాతను పలు ప్రాంత్రాల నుంచి వచ్చిన భక్తులు సందర్శించుకున్నారు. ఉదయాన్నే రైళ్లు, వాహనాల ద్వారా వచ్చిన భక్తులు బాలయేసు దేవాలయం వద్ద ప్రార్థనలు చేసి అనంతరం కొండను ఎక్కి తలనీలాలు సమర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కొండ దిగువ భాగంలో కార్మెల్‌మాతను దర్శించుకొని ప్రార్థనలు చేశారు.

వైఎస్సార్ ఆశయాల సాధనకు కృషి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సురేష్‌కుమార్
- ఫిరంగిపురంలో కంటి వైద్య శిబిరం నిర్వహణ
- 600 మందికి కంటి పరీక్షలు
- 70 మందికి కళ్ల జోళ్లు పంపిణీ



కంటివెలుగు కళ్లజోళ్లు అందజేస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

ఫిరంగిపురం: దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్‌పాల్స్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం దివంగత నేత వైఎస్సార్ జయంతి వారోత్సవాల సందర్భంగా శంకర కంటి వైద్యశాల, నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, వైఎస్సార్ కంటివెలుగు ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని కత్తెర సురేష్‌కుమార్ ప్రారంభించి మాట్లాడుతూ రూపాయి డాక్టర్‌గా వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల మన్ననలు పొందాడని చెప్పారు. ముఖ్యమంత్రిగా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయాడని తెలిపారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాసంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ప్రతిపక్ష నాయకుడు, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 14ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధి ఏమిలేదని చెప్పారు. రాష్ట్రంలో ఏ ఒక్క వ్యక్తికి కూడా సెంటు స్థలం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఒక్క సంక్షేమ పథకం ప్రారంభించి వాటిని సక్రమంగా ఇచ్చిన పరిస్థితి లేవన్నారు. కానీ నేడు ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు ముందుకువచ్చి పనికి రాని హామీలు ఇస్తున్నాడని చెప్పారు. కానీ ఆయన మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మన ప్రియతమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చిన తరువాత ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా చూస్తున్న ప్రజానాయకుడిగా గుర్తింపు, ప్రజాభిమానం పొందాడని చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీ రావడంతోనే ఇంటివద్దకే వలంటీర్లు వచ్చి పింఛన్ అందజేస్తున్నారన్నారు. ఇటువంటి పరిస్థితి మరే రాష్ట్రంలోనూ లేదని తెలిపారు. ప్రజల హృదయాలను చూరకొన్న మన ప్రియతమ నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కంటి వెలుగును ప్రవేశపెట్టి పేదలైన వారికి పరీక్షలు నిర్వహించి వారికి కళ్లజోళ్లు ఉచితంగా అందిస్తున్నారని చెప్పారు. అనంతరం 600 మందికి కంటిపరీక్షలు నిర్వహించగా 440మందికి శుక్లాలు తీయించుకునేందుకు రిఫర్ చేశారు. 70 మంది పేదలకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, వైస్ ఎంపీపీ జి.చంద్రం, మేడికొండూరు ఎంపీపీ మన్నవ స్వప్న, చిట్టా అంజిరెడ్డి, కె.చిన్నప్పరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, షేక్ అబ్దుల్ గఫార్, పి.మరియబాబు, సర్పంచ్ మేడా బాబు, డి.సురేష్, బి.శ్రీనివాసరెడ్డి, నాగరాజు. కె.శ్రీనివాసరెడ్డి, జి.మస్తాన్‌వలి, పి.చిన్న, ఖాజావలి, టి.కృష్ణ, సత్యం, ఎస్.నాగరాజులు పాల్గొన్నారు.



శిబిరానికి హాజరైన జనం

గ్రంథాలయాల ద్వారా విజ్ఞాన సముపార్జన

తాడికొండ: గ్రంథాలయాల ద్వారా పాఠకుల్లో విజ్ఞాన సముపార్జన పెంపొందించవచ్చని ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు జొన్నల సుబ్బారెడ్డి అన్నారు. తాడికొండలో గ్రంథాలయ స్థాపకుడు బిట్రా ఆంజనేయులు జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 100 సంవత్సరాల కిందట తాడికొండలో గ్రంథాలయ స్థాపనకు కృషి చేసిన బిట్రా ఆంజనేయులును స్మరించుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులపై ఉందన్నారు. 2022 జులై 3 నుంచి 2023 జులై 3 వరకు గ్రంథాలయంలో నిత్య పఠనం చేస్తున్న విద్యార్థి వెంకట జశ్వంత్‌కు గ్రంథాలయాధికారి జి శ్రీనివాసరావు చేతుల మీదుగా బెస్ట్ రీడర్ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ సభ్యులు కందుల గోపాలరావు, ఎన్ సుబ్బారావు, చింతల భాస్కరరావు, గ్రంథాలయ సిబ్బంది నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి వెంకట జశ్వంత్‌కు బెస్ట్ రీడర్ అవార్డు అందజేస్తున్న ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ సభ్యులు

జేసీఎస్ కన్వీనర్లకు ఘన సన్మానం

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో జేసీఎస్ కన్వీనర్లుగా నియమితులైన వారిని ఆదివారం టీమ్ ఆర్కే కార్యాలయంలో సన్మానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆశీస్సులతో జేసీఎస్ కన్వీనర్లుగా నియమితులైన అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, ఈదులమూడి డేవిడ్‌రాజు, మహమ్మద్ ఫిరోజ్‌లను సన్మానించారు. కన్వీనర్లుగా నియమితులైన వారు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆర్కే, వైఎస్సార్‌సీపీ నాయకులు మా మీద ఎంతో బాధ్యత ఉంచి జేసీఎస్ కన్వీనర్లుగా నియమించారని, రాబోయే ఎన్నికల్లో మంగళగిరి కోటపై తిరిగి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసే విధంగా కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకటరామిరెడ్డి, అజయ్, రవిసాగర్, గౌస్, సీఎం చిన్ని, తోట శ్రీను, తోట శ్రీనివాసరావు యాదవ్, చిన్నబోతుల దుర్గారావు, కొల్లి శేషిరెడ్డి, తోట సాంబ, టీమ్ ఆర్కే సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జేసీఎస్ కన్వీనర్లను సత్కరిస్తున్న టీమ్ ఆర్కే సభ్యులు

పేదల ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో దీర్ఘకాలంగా వివిధ ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదల ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో గాదె సుబ్బారెడ్డి అధ్యక్షత సీపీఎం పట్టణ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సుమారు 5 వేల కుటుంబాలు ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని, వీరందరికీ నివాసం ఉంటున్న చోటనే పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీఆర్‌డీఏ ప్రాంతంలో సెంటు స్థలం ఇచ్చి ఆ నెపంతో ఇక్కడ ఇళ్లు తొలగించడం అన్యాయమని అన్నారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు, నాయకులు కొట్టి కరుణాకరరావు, వేముల దుర్గారావు, సోలా ముత్యాలరావు, మోదుగుల శ్రీనివాసరెడ్డి, యనమాల బర్నబాస్, పి.గిరిజ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాక గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన నెమలికంటి చిన్నబాబు అనారోగ్యంతో మృతి చెందగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. మృతుడి కుటుంబానికి ఆ మొత్తాన్ని వైఎస్సార్ సీపీ కన్వీనర్ దామేశ్వరరెడ్డి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొక్క ప్రసన్న, పులి భుజంగరావు, అన్నూరి సుబ్బారావు, సూరిబాబు, అచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా వలంటీర్ల చొరవ

పిడుగురాళ్ల వెళ్లి పింఛన్ అందజేత

తాడేపల్లిరూరల్: ఇద్దరు మహిళా వలంటీర్లు చొరవ చూపించి పల్నాడు జిల్లాలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడికి ఆదివారం వృద్ధాప్య పింఛన్ అందజేశారు. నులకపేటకు చెందిన వంశీ మైఖేల్ రాజు పిడుగురాళ్లలో తన కూమార్తె ఇంటికి వెళ్లగా అక్కడ అస్వస్థతకు గురికావడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య నిమిత్తం చేర్పించారు. ఈ సమాచారం తెలుసుకున్న వలంటీర్ శ్యామల మరో వలంటీర్ రమ్యకృష్ణ సహాయంతో ద్విచక్ర వాహనంపై వెళ్లి పింఛన్ అందజేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మైఖేల్ రాజుకు పింఛన్ అందజేయడం పట్ల అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

‘ఆహార వైద్యము’ పుస్తకావిష్కరణ

తెనాలి: పట్టణానికి చెందిన విశ్రాంత బ్యాంకు అధికారి, స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు, రచయిత సాయి లక్కరాజు 30 ఏళ్ల సాహిత్య ప్రస్థానం సభను ఆదివారం ఉదయం స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సీఈవో దైవాల సుబ్రహ్మణ్యేశ్వరరావు అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై, సాయి లక్కరాజు 10వ రచన ‘ఆహార వైద్యము’ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటికాలంలో మనిషి ప్రకృతి నుంచి దూరంగా వెళుతున్నాడని చెప్పారు. ఏదైనా అనారోగ్యం కలిగితే అప్పటికప్పుడు తక్షణ ఉపశమనం కోసం చూస్తున్నాడని తెలిపారు. ఫలితంగా అనారోగ్యాలు, మందుల వాడకం ఎక్కువైందని చెప్పారు. సాయి లక్కరాజు 223 రకాల స్వల్పకాలిక వ్యాధులకు మన ఇంట్లో ఆహారంలో వినియోగించే పదార్థాలతో ఉపశమనం పొందవచ్చంటూ రాసిన పుస్తకం ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ వైద్యం ఎంతగా విస్తరించినా మనిషి రోజువారీ మందుల ఖర్చులు పెరిగాయని గుర్తుచేశారు. దీనికి పరిష్కారంగా సాయి లక్కరాజు వంటింటి పదార్థాలతోనే అనేక బాధల నుంచి ఉపశమనం పొందే వైనాన్ని చక్కగా సరళమైన భాషలో రాయటం సంతోషంగా ఉందన్నారు. పలు రోగాలనూ నివారించుకోవచ్చని చెప్పారు. పుస్తకాలనూ, మొక్కలను బహుమతిగా ఇవ్వటం నేర్చుకోవాలని సూచించారు. సాయి లక్కరాజు మాట్లాడుతూ 30 ఏళ్ల కిందట తన తొలి కవిత ఇదే నెలలో ప్రచురితమైందని గుర్తుచేసుకున్నారు. పది పుస్తకాలు రాసినా, ఆవిష్కరణకు వెళ్లటం ఇదే తొలిసారిగా చెప్పారు. ఆహార వైద్యము పది మందికీ ఉపయోగపడాలనే ఉద్దేశంతోనే ఇందుకు పూనుకున్నట్టు చెప్పారు. రోగనిరోధక శక్తినీ ఇంట్లోని వస్తువులతోనే పెంచుకోవచ్చని చెప్పారు. రాయపాటి ప్రేమ్‌కుమార్ స్వాగతం పలికారు.



ఆహార వైద్యము పుస్తకావిష్కరణలో ఆలపాటి రాజా, రాజకుమారి, సాయిలక్కరాజు

ఐఐటీల్లో సీట్లు సాధించడం నగరానికి గర్వకారణం

పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

గుంటూరు ఎడ్యుకేషన్: నగర విద్యార్థులు దేశంలో అత్యున్నత సాంకేతిక విద్యాసంస్థలుగా పేరు గాంచిన ఐఐటీల్లో సీట్లు సాధించడం గర్వకారణమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అన్నారు. ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా టాప్-10లో ఓపెన్ కేటగిరీలో 5, 10వ ర్యాంకులు కైవసం చేసుకున్న భాష్యం ఐఐటీ-జేఈఈ అకాడమీ విద్యార్థులు ఏ. వెంకట శివరామ్, వై.వి. మణీందర్‌రెడ్డికి ఆదివారం చంద్రమౌళీనగర్‌లోని భాష్యం ప్రధాన క్యాంపస్ వద్ద విద్య, వైద్య, రాజకీయ ప్రముఖుల సమక్షంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ ఐఐటీ ముంబైలో విద్యను అభ్యసించేందుకు వెళ్తున్న ఇద్దరు విద్యార్థులు జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆలిండియా ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఏ.వి. శివరామ్, వై.వి.మణీందర్‌రెడ్డి ఉన్నత విద్యాభ్యాసానికి రూ.10 లక్షలు చొప్పున రూ.20 లక్షలను భాష్యం రామకృష్ణ అందించడం ముదావహమన్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ 60 ఏళ్ల ఐఐటీ చరిత్రలో గుంటూరు జిల్లా నుంచి మొట్టమొదటిసారిగా ఓపెన్ కేటగిరీలో అఖిలభారత స్థాయిలో 5, 10వ ర్యాంకులు సాధించడం ద్వారా భాష్యం జిల్లాకు గర్వకారణంగా నిలిచిందన్నారు. అంతటి ఘన విజయానికి కారకులైన అధ్యాపక బృందం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. సభలో పాల్గొన్న మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ మంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ భాష్యం విద్యాసంస్థలు జిల్లాకు గర్వకారణంగా నిలిచాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, భాష్యం ఐఐటీ-జేఈఈ అకాడమీ ప్రోగ్రామర్ ఆనంద్‌కుమార్, భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ భాష్యం హనుమంతరావు, ముఖ్య సలహాదారు మైకేల్‌రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, జెడ్‌ఈవోలు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, పక్కన భాష్యం రామకృష్ణ

నేడు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శాకంబరీ ఉత్సవం



ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

పాత గుంటూరు: గంటలమ్మ చెట్టు వీధి శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ మాస శాకంబరీ ఉత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కొత్తూరి వెంకట నరసింహారావు తెలిపారు. ఆలయంలో ఆదివారం కార్యక్రమాల ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో అమ్మవారికి విశేషంగా గోరింటాకు అలంకారం, మూలా నక్షత్రం, పౌర్ణమి సందర్భంగా అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు పసుపుకుంకుమ, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా భక్తులతో అమ్మవారికి సారే సమర్పణ జరుగుతుందని తెలిపారు. 12 గంటలకు మహా నైవేద్యం, మంత్రపుష్పం, మంగళ హారుతులు, తీర్థ ప్రసాద వినియోగం ఉంటుందని తెలిపారు. సాయంత్రం జగన్నాథ మహిళా మండలి వారి కోలాట భజన నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వంగవీటి పోరాటం స్ఫూర్తిదాయకం

వంగవీటి చైతన్య రథసారథులు పుస్తకావిష్కరణలో వక్తలు

తెనాలి: బడుగు బలహీనవర్గాలకు అండగా అనేక పోరాటాలు చేసిన వంగవీటి మోహనరంగా జీవితం స్ఫూర్తిదాయకమని యునైటెడ్ ఇండిపెండెంట్స్ విద్యార్థి సంఘం (యూఐ) రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తుర్లపాటి సురేష్ అన్నారు. వంగవీటి రాధా రంగా స్మారక కాపు యువజన సేవాసమితి ఆధ్వర్యంలో ప్రచురించిన ‘వంగవీటి చైతన్య రథసారథులు’ పుస్తకాన్ని ఆదివారం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఆవిష్కరించారు. పుస్తక రచయిత తుర్లపాటి సురేష్ మాట్లాడుతూ వంగవీటి మోహనరంగాతో తనకున్న అనుబంధాన్ని, ఆయన పోరాట స్ఫూర్తిని, నడిపిన ప్రజా ఉద్యమాలపై సోషల్ మీడియా సాక్షిగా తాను వ్యక్తీకరించిన జ్ఞాపకాలే ఈ పుస్తకమని చెప్పారు. ప్రచురించిన సేవాసమితి అధ్యక్షుడు తన్నీరు శివశంకర్ అభినందనీయులన్నారు. రంగా మరణించి 35 ఏళ్లవుతున్నా, ఆయన ఇంకా ప్రజల గుండెల్లో చిరస్మరణీయులుగానే ఉన్నారనీ, ఇప్పటికీ పలుచోట్ల ఆయన విగ్రహాల ఆవిష్కరణలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. వంగవీటి రాధా రంగ కాపు యువజన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తన్నీరు శివశంకర్ మాట్లాడుతూ రంగా ముఖ్యఅనుచరుడిగా, యూఐ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రంగాతో అత్యంత సన్నిహితంగా మెలిగిన తుర్లపాటి సురేష్ రచనలను పుస్తకంగా తీసుకొచ్చే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. రంగా కేవలం ఒక సామాజికవర్గానికి మాత్రమే చెందిన వ్యక్తి కాదనీ, ఆయన అందరివాడిగా ఈ పుస్తకం నిరూపిస్తుందని చెప్పారు. వంగవీటి రాధా రంగా మిత్రమండలి వ్యవస్థాపకుడు చెన్నుపాటి శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ తోటకూర వెంకట రమణారావు, మాజీ సర్పంచ్ ఉగ్గిరాల సీతారామయ్య, న్యాయవాది పొన్నం విజయకుమార్, రఘుపతి వెంకటరత్నం, కాపు వసతిగృహ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలిశెట్టి విజయ్, గాదె విజయకుమార్ పాల్గొన్నారు. డాక్టర్ తన్నీరు కళ్యాణ్‌కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు.



పుస్తకాన్ని ఆవిష్కరించిన తుర్లపాటి సురేష్

జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ తనిఖీలు

గుంటూరు మెడికల్: జీజీహెచ్ జనరల్ మెడిసిన్ వైద్య విభాగాన్ని సూపరింటెండెంటు డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులో సుమారు 10 మంది రోగులు మంచాలు సరిపడా లేక స్ట్రెచ్చర్‌ల పైనే చికిత్స పొందడాన్ని గమనించి తక్షణమే అదనంగా 50 పడకలు మంజూరు చేశారు. బాత్‌రూమ్‌ల తలుపులు విరిగిపోయి, అపరిశుభ్రంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పైప్ లైన్ నుంచి నీరు వృథాగా పోవడాన్ని గమనించి తక్షణమే రిపేర్లు చేయించాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు.

ఏఎంసీ విభాగం తనిఖీ


జనరల్ మెడిసిన్ విభాగంలో తనిఖీల అనంతరం డాక్టర్ కిరణ్‌కుమార్ ఎక్యూట్ మెడికల్ కేర్ యూనిట్(ఏఎంసీ)లో తనిఖీలు చేశారు. మెడికల్ ఐసీయూలో పరిశుభ్రత లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసి, తక్షణమే క్లీనింగ్ చేయాలని ఆదేశించారు. రోగుల సహాయకులు అధిక సంఖ్యలో ఏఎంసీలోకి వస్తున్నారనే విషయాన్ని గమనించి, తక్షణమే వారిని కట్టడి చేసేలా అక్కడ సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. తనిఖీల్లో సూపరింటెండెంటుతో పాటు సివిల్ సర్జన్ ఆర్‌ఎంవో డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్ ఉన్నారు.



తనిఖీలు చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

జెడ్పీలో ముగ్గురికి కారుణ్య నియామకాలు

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ కార్యాలయం పరిధిలో ముగ్గురు అభ్యర్థులకు జూనియర్ అసిస్టెంట్లుగా కారుణ్య నియామకాల్ని కల్పిస్తూ జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా నియామకపత్రాలు అందజేశారు. ఆదివారం జెడ్పీ ప్రాంగణంలోని క్యాంపు కార్యాలయంలో డి. భరత్‌రెడ్డికి అచ్చంపేట ఎంపీడీవో కార్యాలయం, పి. రమ్యదీప్తికి తెనాలి ఎంపీడీవో కార్యాలయం, షేక్ పర్వీన్‌కు చిలకలూరిపేటలోని జెడ్పీ హైస్కూల్లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఉద్యోగాలు పొందిన వారు కష్టపడి పని చేయాలని, విధి నిర్వహణలో సీసీఏ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ పరిపాలనాధికారి గరికపాటి శ్రీనివాసరావు, పొన్నూరు జెడ్పీటీసీ సభ్యుడు రమేష్, ఏవో హేమంత్ పాల్గొన్నారు.



నియామకపత్రం అందజేస్తున్న హెనీ క్రిస్టినా

12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలని పీఆర్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షుడు జీవీఎస్ రామకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లాడ్జి సెంటర్లోని ఎల్ఎంపీ స్కూల్లో ఆదివారం జరిగిన పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై ఒకటో తేదీ నుంచి ఉద్యోగులకు నూతన వేతన సవరణ స్కేల్ అమలు పర్చాలని కోరారు. డీఏ బకాయిలతో పాటు 11వ పీఆర్సీ బకాయిలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ప్లస్ టూ స్కూళ్లలో నియమించిన పీజీటీలకు జాబ్ చార్ట్‌ను అమలు పర్చడంతో పాటు వారికి వేతనాలు చెల్లించాలని కోరారు. ఎంఈవో-1, 2 పోస్టులకు జాబ్‌చార్ట్ విడుదల చేసి, భర్తీ చేయగా మిగిలిన ఎంఈవో-1 పోస్టులను జెడ్పీ హెచ్‌ఎంలతో భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఇటీవల బదిలీలు, ఉద్యోగోన్నతులు పొందిన పీఆర్టీయూ నాయకులు, కార్యకర్తల్ని సత్కరించారు. సమావేశంలో భాగంగా సంఘ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్ రజాక్‌తో పాటు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా వీసీహెచ్ ముక్కంటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి. సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి జె. సుధీర్, బాపట్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ. రాంబాబు, ఏ.వి.నారాయణ, నాయకులు ఎన్‌పీసీ విద్యాసాగర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ

కొనసాగుతున్న డ్రెయిన్‌ల పూడికతీత



పెదపరిమిలో జరుగుతున్న డ్రెయిన్‌ల పూడికతీత

పెదపరిమి(తాడికొండ): తాడికొండ మండలం పెదపరిమి గ్రామం నుంచి మంగళగిరి వెళ్లే ప్రధాన రహదారి వెంట పూడుకుపోయిన డ్రెయిన్‌ల పూడికతీత కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. కాల్వలలో పేరుకుపోయిన మురుగు, జమ్మును జేసీబీతో తొలగించి భారీగా మురుగును ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ ప్రాంతానికి తరలిస్తున్నారు. గ్రామంలో మురుగు బయటకు వెళ్లేందుకు ప్రధాన డ్రెయిన్ ఇదే కావడంతో మూసుకుపోయి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పూడికతీత పనులు ముమ్మరం చేసినట్లు కార్యదర్శి ఎం శ్రీనివాసరావు తెలిపారు.